వచ్చాక కూడా ఇలానే ఉంటుందా? మనం ఇలాంటి చిన్న సమస్యలను పరిష్కరించకుండానే ఈ సమాజాన్ని మార్చగలమా?'' అని ఆగాడు.

''నువ్వు మాట్లాడటం పూర్తయిందా కామ్రేడ్!?''.

అతను చిన్నగా తలూపాడు.

''ఒకటి మాత్రం నిజం. మనది నెలబాలుడి ఉద్యమం అంటుంటాం. ఇక్కడ తప్పులు జరుగుతున్నాయి. అందులో ఎలాంటి సందేహం లేదు. నిజం చెప్పాలంటే ఏదో కొసకు లాక్కుపోతున్నారు. మధ్యేమార్గం ఈ ఆవేశాల్లో కనిపించదు. సుదీర్ఘకాలం పోరాటం చేయడం, నమ్మకాన్ని పెంచుకోవడం, నిలబెట్టుకోవడం ఇన్ని నష్టాల మధ్య చాలాకష్టం. ఈ ఉద్యమంలోకి అనేకమంది వస్తుంటారు పోతుంటారు. చివరి వరకు నిలబడగలిగే వారు అతితక్కువ మంది. కొంత మంది బలిదానాలు చేస్తారు. ఇంకొందరు లొంగుబాటు వీరులుగా ప్రపంచం ముందు నిలబడిపోతారు. నాకు కూడా అనిపిస్తున్నది.. మనం అంతర్గతంగా చర్చించవలసిన విషయాలు చాలా ఉన్నాయని. నువ్వు అన్నట్లు ప్రపంచ సాహిత్యంలో ప్రముఖులందరి పేర్లు ఉన్నాయి. వారి రచనలు ఉన్నాయి. అసలు అనామకుడు అని ఎవరన్నా పేరు పెట్టుకున్నా.. అదీ ఓ పేరే'' అన్నదామె.

అతను చిన్నగా నవ్వాడు.

''ఇంకో మాట అడుగుతాను నేస్తం''.

''అడుగు కామ్రేడ్!''

''ఈ కారణం వల్ల నువ్వు ఉద్యమం నుంచి బయటికి వెళ్లవు కదా!''.

''లేదు లేదు! ఇది నా ఒక్కడి బాధ మాత్రమే అనుకోను. మనలో ఇంకా చాలామందికి ఇలాంటిది ఉండవచ్చు. అందరూ బయటికి చెప్పుకోరు. నేనుకూడా ఇంత వరకూ ఎవరితోనూ ఈ విషయం గురించి మాట్లాడలేదు. నీతోనే పంచుకున్నాను''.

''ఇకముందు కూడా అలాగే ఉంటావా?''.

''మౌనంగా పని చేసుకుపోవడం అన్ని సందర్భాల్లోనూ సరైంది కాదు. ఇకనుంచి మన మధ్య అంతర్గత చర్చ జరగాలి. ఇదొక్కటే కాదు. ఇంకా కొన్ని విషయాలు ఉన్నాయి. నాయకత్వానికి అవన్నీ వివరంగా రాసి పత్రం సమర్పిస్తాను. దానిమీద చర్చ జరగాలని సూచిస్తాను. అది మనందరం ఎక్కడ ఉన్నా అందరికీ సర్క్యులేట్ చేస్తారు కదా!''.

''అవును. అలా జరుగుతుందని అనుకుందాం''.

''మరో విషయం. ఇదంతా మరింతగా ఉద్యమం కోసం అంకితం కావడానికే. నాయకత్వం నాలాంటి వారి ఆలోచనలతో విభేదించినా.. మెజార్టీ నిర్ణయాన్ని నేను గౌరవిస్తాను. అందుకు తగ్గట్లుగా ఓ కార్యకర్తగా

**ఎంతోమంది ఉద్యమం నుంచి వెళ్లిపోయారు. వేరు కుంపట్లు పెట్టుకున్నారు. అందులో ముఖ్యులు కవిత్వం రాసినవారు. పాటలు రాసిన వారు. గళం ఎత్తిన వారున్నారు. ఒక్కో క్షణం అనిపించేది. ఆమె చెప్పినట్లు ఓ కొస నుంచి మరో కొసకు ఉద్యమం మలుపు తీసుకుంది.**

పనిచేసుకుంటూ వెళ్తాను''.

''చాలా సంతోషం నేస్తం!'' అన్నదామె.

''మనం కొన్ని గంటల్లో విడిపోతున్నాం. మనం కోరుకున్న సమాజం ఏదో ఒకరోజు వస్తుంది. ఆ నమ్మకం ఉంది. ప్రపంచ చరిత్రను గమనిస్తే కమ్యూనిస్టు పార్టీలన్నీ ఈ వ్యక్తికి చెందిన అస్తిత్వ సమస్యలకు గురవుతున్నాయి అనే స్పష్టత నాకుంది. అందువలన అనేక ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. మనం వ్యక్తులుగా చీలిపోతున్నాం. తర్వాత వ్యక్తుల పేరు మీద సంస్థలు ఏర్పాటు చేసుకుంటున్నాం. ఈ ప్రమాదాన్ని మనం ముందుగా పసిగట్టాలి. దాన్నుంచి బయట పడటానికి ఏం చేయాలో నేర్చుకోవాలి. లేకపోతే చివరికి వ్యక్తులుగా మిగిలిపోతామనే బాధ నన్ను పీడిస్తూనే ఉంటుంది'' అన్నాడు.

''నువ్వు పాటలు రాయడం మానుకుంటావా?''.

''లేదు నేస్తం. పాట నా ప్రాణం. రేపు మనం ఉండం. మన పాటే ఉంటుంది. నేను బతికి ఉన్నంత వరకూ పాటను నేను.. నన్ను పాట వదిలి పెట్టదనుకుంటున్నాను''.

''సెలవు మిత్రమా... మళ్లీ మనం కలుసుకుంటామనే నమ్మకం ఉంది. అప్పటికి కొత్త సమస్యలు వస్తాయి. వాటి గురించి మనం చర్చించుకునే అవకాశం కోసం ఎదురు చూస్తుంటాను'' అన్నదామె.

''సెలవు నేస్తం!'' అన్నాడతను.

ఇద్దరి పిడికిళ్లూ బిగుసుకున్నాయి.

ఆమె చివరిసారి అడిగింది.

''నువ్వు ప్రేమగీతం కూడా రాశావని తెలుసు. అదొక్కసారి పాడగలవా!''.

అతను పాడుతున్నాడు.

ఆమె రెండు కళ్లూ మూసుకుని తన్మయత్వంతో వింటున్నది.

* * *

''ఏం కామ్రేడ్.. నిద్రరావడం లేదా?'' అన్నాడు కాపలా కాస్తున్న వ్యక్తి.

''లేదు మిత్రమా! ఏవేవో జ్ఞాపకాలు'' అన్నాడతను.

''ఉదయమే మన ప్రయాణం. బలవంతంగా అయినా కళ్లు మూసుకో. నిద్రపోవడానికి ప్రయత్నం చెయ్యి. నువ్వు సరిగ్గా నిద్రపోయి ఎన్ని రోజులైందో!'' అన్నాడా వ్యక్తి.

చిన్నగా తలూపి పడుకున్నాడు. మళ్లీ ఆలోచనలు!

ఆమె మళ్లీ కనిపించలేదు. ఎన్‌కౌంటర్‌లో చనిపోయిందని తెలిసినప్పుడు.. అతను రెండు రోజులు భోజనం చేయలేదు. ఆమెకు నివాళిగా తను చేయగలిగింది ఒక్కటే. అశ్రుగీతం రాయడం - అమర గీతం పాడటం. ఆ గీతానికి అతని పేరు ఉంచాలనుకోలేదు. ఆమెతో జరిగిన చర్చ తర్వాత అనేక మార్పులు జరిగాయి. ఉద్యమంలోకి కులం ప్రవేశించింది. ప్రాంతం ప్రవేశించింది. ఎంతోమంది ఉద్యమం నుంచి వెళ్లిపోయారు. వేరు కుంపట్లు పెట్టుకున్నారు. అందులో ముఖ్యులు కవిత్వం రాసినవారు. పాటలు రాసిన వారు. గళం ఎత్తిన వారున్నారు. ఒక్కో క్షణం అనిపించేది. ఆమె చెప్పినట్లు ఓ కొస నుంచి మరో కొసకు ఉద్యమం మలుపు తీసుకుంది. వ్యక్తిగత ప్రాబల్యం తగ్గించాలనుకున్న నిర్ణయం వికృతంగా మారింది. ఇప్పుడు అన్నీ వ్యక్తుల పేరు మీదే. ఇలాంటిది కవులూ, గాయకుల్లోనే ఎక్కువ ఉంటుందా? నేను తప్పు చేశానా? వ్యక్తిగా మించి ఎదగలేకపోయానా!? అనే ఆలోచనలు వచ్చాయి.

క్యాడర్‌ను కాపాడుకోవడం కష్టంగా మారింది. ముఖ్యమైన నాయకులు ఎన్‌కౌంటర్లలో చనిపోయారు. కొత్తవారు వస్తున్నా.. ఇంతకుముందులా ఎక్కువమంది ఉద్యమం పట్ల ఆకర్షితులు కావడం లేదు. ఓ రకంగా చెప్పాలంటే చిన్నచిన్న బృందాలు. రాజకీయ, సైద్ధాంతిక అవగాహన పరిమితంగా ఉంది. అతని అమ్మానాన్నలు చనిపోయారని తెలిసినప్పుడు అతను భోరున ఏడ్చాడు.

'నేను సైతం మామూలు మనిషిని అయ్యాను!' అనుకున్నాడు.

'ఇది సహజం నేస్తం!' అని ఆమె ఓదార్చుతున్నట్లు భావించాడు.

ఉద్యమం ఇంకా పసిప్రాయంలోనే ఉంది.

కనుచూపు మేరలో ఏ మార్పూ కనిపించడం లేదు.

శరీరాన్ని, మనసునీ, బందూకుని, నమ్మకాన్నీ మోసుకుంటూ ప్రయాణం చేయాల్సిందే!

చివరికి మిత్రులు శత్రువులుగా మారిపోయారు.

అనేక పొరపాట్లు జరుగుతున్నాయి. అయినా...!

* * *

ఉషోదయపు కిరణాలు అతని ముఖం మీద పడ్డాయి. అప్పటికే అందరూ తయారవుతున్నారు బయల్దేరడానికి. ప్రయాణం ఆరంభమైంది.

అప్పుడు మొదలయ్యాయి కాల్పులు.

క్షణాల్లో తేరుకుని అతను కాల్చడం మొదలుపెట్టాడు.

కామ్రేడ్స్ అందరూ తలో దిక్కు అవుతున్నారు.

కొందరి గుండెల్లో, మరి కొందరి వెన్నులో బుల్లెట్స్ దూసుకుపోయాయి. అతను తృటిలో తప్పించుకునేవాడు. ఇంతలో.. అతని శరీరం ఎగిరెగిరి పడింది.

బుల్లెట్ల వర్షం... అతను కుప్పకూలిపోయాడు.

* * *

పోలీసులు అతని బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు.

అతని డైరీ నిండా పాటలు.. పాటలు.. ఉద్యమాన్ని ఉద్రూతలూగించిన పాటలు..

అతను లేడు. అతని పాటలూ లేవు!

ఓ అశ్రుగీతాన్ని ఎవరో రచిస్తున్నారు. ■

## పి. చంద్రశేఖర ఆజాద్



రచన తప్ప మరో ప్రపంచం లేకుండా.. నాలుగు దశాబ్దాలుగా సాహితీసేవ చేస్తున్నారు పి. చంద్రశేఖర ఆజాద్. పుట్టిపెరిగింది.. గుంటూరు జిల్లా వెల్లటూరు. ప్రస్తుత నివాసం హైదరాబాద్. ఏపీ స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా వీఆర్ఎస్ తీసుకుని పూర్తికాలం రచయితగా కొనసాగుతున్నారు. ఇప్పటివరకూ 850కి పైగా కథలు, 85 నవలలు, 18 నవలికలు, 50కి పైగా కవితలు, 15 ఫీచర్స్, అనేక వ్యాసాలు, ముందుమాటలు, రేడియో, స్టేజ్ నాటికలు రాశారు. రేడియో, సినిమా, సాహితీ సంస్థల నిర్వహణతో పాటు కొన్ని సీరియల్స్, ఒకటి రెండు సినిమాల్లో నటించారు. ఈయన రాసిన 'అడవి పూలు' టెలీ ఫిల్మ్ సంభాషణలకు రెండు నంది అవార్డులు అందుకున్నారు. కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందించిన నాలుగు టెలీ ఫిల్మ్‌కు మూడు స్వర్ణ నందులు, ఓ వెండి నంది స్వీకరించారు. 'భారతి' పిల్లల సినిమాకు స్వర్ణ నంది దక్కింది. 30 నవలలకు, వందకుపైగా కథలకు వివిధ పత్రికలు, వివిధ సంస్థల నుంచి బహుమతులు వచ్చాయి.